
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
మంగళవారం 1 ఏప్రిల్ 2025



వ్యవసాయ కళాశాలను మరోచోట ఏర్పాటు చేయాలి
● తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత 7

రాంమందిర్ ఉగాది వేడుకల్లో జగ్గారెడ్డి



రాంమందిర్‌లో నిర్వహించిన భజనలో డోలక్ వాయిస్తూ పాటలు పాడుతున్న జగ్గారెడ్డి

డోలక్ వాయిస్తూ భజన పాటలు పాడిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

రాంమందిర్‌లో శావను మోసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఉగాది పండుగ ఘనంగా జరిగింది. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని రాంమందిర్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ప్రతీ ఏడాదిలాగే ఈసారి సీతారాముల ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్రను నిర్వహించారు. ఇందులో జగ్గారెడ్డి శావను భుజాన ఎత్తుకుని రామనామ జపం చేస్తూ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి డోలక్ వాయిస్తూ భజన పాటలతో భక్తులను మైమరిపించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులతో కలిసి భజన పాటలు పాడుతూ ఆధ్యాత్మికసేవలో మైమరిచిపోయారు.



ఉగాది వేడుకలలో భాగంగా సంగారెడ్డిలోని రాంమందిర్‌లో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొని శావ మోసిన జగ్గారెడ్డి

నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా పనిచేస్తా

● ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక ప్రాంత అభివృద్ధే తన లక్ష్యమని, దుబ్బాక కోసం తాను ఎవరినైనా కలవడానికి వెనుకడుగువేయబోనని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం.. ఆయన శాసనసభకు నాయకత్వం వహిస్తున్నాడు.. ఆయనను కలిసి అభివృద్ధి పనులు అడగడం శాసనసభ్యుడిగా తనకున్న హక్కు చెప్పారు. సోమవారం ఆయన దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. తాను అడగగానే స్కిల్ యూనివర్శిటీని మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దీనిని ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఎకరాల స్థలం అవసరం ఉంటుందనీ, దుబ్బాక ప్రజల అందరీ ఆమోదయోగంతో స్థల సేకరణ చేపడుతామని చెప్పారు. స్థల ఎంపికలో అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని, అనువైన స్థలంలోనే స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తామన్నారు. దుబ్బాకకు పలు అభివృద్ధి పనులు రావాల్సి ఉందని, అందుకు సీఎం కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. మెదక్- సిద్దిపేట జాతీయరహదారిని



ఆనుకుని హబ్సీపూర్- దుబ్బాక- లచ్చపేట రహదారి విస్తరణకు సుమారు రూ.35కోట్లను మంజూరు చేయడానికి సీఎం అంగీకరించారని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలో రహదారుల ఏర్పాటుకు రూ.200 కోట్ల నిధులను కోరామని, మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాలువల ఏర్పాటు ముఖ్యమన్నారు. దుబ్బాక నియోజక వర్గంలో సుమారు లక్ష 30 వేల ఎకరాల సాగుకు నీరందించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకు కాలువలు పూర్తికాలేదనీ, గతంలో ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలువడం, ప్రస్తుతం తమ అధికారం లేకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్నచందంగా మారాయన్నారు.

నిర్మాణరంగం ఢమాల్!

● మందగించిన రియల్ వ్యాపారం
● ప్రభుత్వం మారడంతో గజ్వేల్‌లో మారిన సీన్
● అయినా రోజురోజుకూ పెరుగుతున్న స్టీల్, ఇసుక ధరలు
● సిమెంట్ ధరలూ పెరిగే అవకాశం?
● వ్యాపారం సాగక అవస్థలు పడుతున్న దుకాణదారులు
● రెండేళ్లతో పోలిస్తే 50 శాతం పడిపోయిన నిర్మాణాలు

గజ్వేల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గ పరిస్థితి తారుమారయింది. గతంలో అన్నిరంగాల్లో పరుగులు తీసిన గజ్వేల్ ప్రస్తుతం డౌన్‌ఫాల్ అవుతుంది. రియల్ వ్యాపారం కుదేలవడం, ప్రభుత్వం మారడం... ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా మారడం, ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్‌లో అన్ని వ్యాపారాలు మందగించాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఆగిపోవడంతో ఒక్కసారిగా పరిస్థితి కుదేలైంది. భవన నిర్మాణాలు సైతం భారీ స్థాయిలో తగ్గిపోయాయి. ఒకప్పుడు ఒక గల్లీలో ఐదు నుంచి పది భవన నిర్మాణాలు జరిగేవి. కానీ ప్రస్తుతం అవి ఒకటి రెండుకే పరిమితమయ్యాయి. భవన నిర్మాణరంగం పూర్తిస్థాయిలో గాడి తప్పింది. అయినప్పటికీ స్టీల్, ఇసుక ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. స్టీల్ ధరలు ఆకాశాన్ని తాకగా, ఇసుక ధరలు అత్యధిక రేటును తాకింది. మరో వైపు సిమెంట్ ధరలు పెరిగే అవకాశం ఉందని ఆయా కంపెనీల ద్వారా తెలుస్తుంది. ఈ కారణంగా కొత్తగా ఇళ్లను నిర్మించాలనుకుంటున్న వారు సైతం పెరిగిన ధరలతో అటువైపు చూసేందుకు జంకుతున్నారు.

గజ్వేల్‌లో పూర్తి భిన్నం

గజ్వేల్ నియోజకవర్గంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత పదేళ్లలో కనివినీ ఎరుగని రీతిలో గజ్వేల్‌తో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా రియల్ వ్యాపారం మూడు... పువ్వులు ఆరు కాయలుగా సాగింది. కరోనా కారణంగా దెబ్బతిన్న రియల్ వ్యాపారం ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో మెరుగుపడిన పరిస్థితి లేదు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ప్రభుత్వం విధానాలపై స్పష్టత లేకపోవడంతో రియల్ వ్యాపారస్తులు పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారు. ఈ క్రమంలోనే గతంలో వీఐపీ నియోజకవర్గంగా ఉన్న గజ్వేల్ ప్రస్తుతం ఎటూ కాని పరిస్థితిలోకి వెళ్లిపోయింది. గతంలో ఇళ్లు అద్దెకు కావాలంటే దొరకని పరిస్థితి నుంచి ప్రస్తుతం ఎటు చూసినా టూలెట్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. గతంలో ఏడాదిలో సగటున ఏడాదికి 300 ఇళ్లను నిర్మించిన గజ్వేల్ పట్టణంలో ప్రస్తుతం 100 కూడా నూతన నిర్మాణాలు లేవు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. గల్లీకి ఒకటి, రెండు ఇళ్లను మాత్రమే నిర్మిస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

భారీగా పెరిగిన స్టీల్, ఇసుక ధరలు

ఓ వైపు ఇళ్ల నిర్మాణాలు తారాస్థాయికి పడిపోయిన క్రమంలో వాటి ఉపయోగించే ముడి సరుకు అయిన స్టీల్, ఇసుక ధరలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. గతంలో స్టీల్ కిలో ధర రూ.54 కిలో ఉండగా, ప్రస్తుతం స్టీల్ కిలో ధర రూ.58కి చేరింది. ఇసుక ధర టన్నుకు రూ.1100గా ఉంటే ప్రస్తుతం టన్ను ఇసుక ధర రూ. 1800, రూ.1900కు చేరింది. సిమెంట్ ధరలు రూ.260 నుంచి రూ.300 వరకు, మరో కంపెనీ రూ.300 నుంచి రూ.340 వరకు పెరిగే అవకాశాలున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై రాష్ట్ర సర్కార్ ఉక్కుపాదం ఇసుక ధరలు కనివీని ఎరుగని రీతిలో పెరిగాయి. అసలే నిర్మాణాలు లేక వ్యాపారం సన్నగిల్లిందని వ్యాపారులు భావిస్తుంటే.. అందుకు తోడు ధరల పెరుగుదలతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తమ పరిస్థితి మారిందని స్టీల్, సిమెంట్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారం తగ్గింది

గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది వ్యాపారం సన్నగిల్లింది. స్టీల్, సిమెంట్ వ్యాపారానికి జనవరి నుంచి మే వరకు సీజన్ ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తే అన్‌సీజన్ మాదిరిగానే అనిపిస్తుంది. ఇందుకు తోడు ఇటీవల స్టీల్ ధరలు పెరగడంతో అసలే అంతంత మాత్రంగా ఉన్న వ్యాపారంపై మరో దెబ్బ పడినట్లు అనిపిస్తుంది. స్టీల్‌తో పాటు ఇసుక ధరలు పెరగడం కూడా సమస్యనే. ఏదిఏమైనా వ్యాపారం ఈ ఏడాది ఆశించిన స్థాయిలో లేదు.

- చేతిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, స్టీల్ వ్యాపారి



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్




● ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
● శుభాకాంక్షలు తెలిపిన ఆయా పార్టీల నాయకులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లాలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఈద్ ఉల్ ఫితర్ కోసం పట్టణంలోని ఈద్గాలు, మసీదులు ముస్తాబు చేశారు. సుఫియా మసీదు, హజ్రా మసీదు, నసీరియా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణలోని ఈద్గా మైదాన్‌లో ముస్లింలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాయ్ బలాయ్ అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కబరస్థాన్‌లో తమ పూర్వికుల సమాధులపై పూలతో నివాళులర్పించి ప్రార్థనలు చేశారు. మాజీ కౌన్సిలర్ సురేందర్‌రెడ్డి తాగునీటి సౌకర్యం కల్పించారు.



ముస్లిం నాయకుడు ఎండీ హసన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న హరీశ్‌రావు

రంజాన్ వేడుకల్లో మంత్రి పొన్నం

హుస్నాబాద్ : రంజాన్ సందర్భంగా సోమవారం రాత్రి హుస్నాబాద్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముస్లిం స్నేహితుల నివాసాలకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. వారికి స్వీట్లు తినిపించి ఈద్ ముబారక్ తెలిపారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందర్, తిరుపతిరెడ్డి, జంగపల్లి అయిలయ్య, ఎండి హసన్, ఎండి సర్దార్, సాజిద్ తదితరులున్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు పనిచేయాలి

సిద్దిపేట కల్చరల్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వాలు పనిచేయాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట ఈద్గా మైదానంలో సోమవారం జరిగిన రంజాన్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనతో హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా అన్నివర్గాల అభ్యున్నతికి కేసీఆర్ పాటుపడ్డారని గుర్తుచేశారు. మతసామరస్యానికి నెలవు సిద్దిపేట అని చెప్పారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు.



తాగునీటిని అందిస్తున్న మాజీ కౌన్సిలర్ సురేందర్‌రెడ్డి



యమ డేంజర్

● సిద్దిపేటలో రక్తమోడుతున్న రాజీవ్ రహదారి ● రంగీలా చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు...
● ప్రమాదకరంగా మారిన ఆ రెండు కిలోమీటర్లు ● 'డబుల్' ఇళ్ల వద్ద ఏర్పాటు చేయని సూచిక బోర్డులు, బారికేడ్లు
● తరచూ రోడ్డు ప్రమాదాలు.. రాత్రివేళల్లో అధికం ● రాంగ్ రూటే ప్రధాన కారణం!!

సిద్దిపేట టౌన్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): రవాణా సౌకర్యార్థం, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు సిద్దిపేట జిల్లాలో నిర్మించిన నాలుగు లేన్ల రాజీవ్‌రహదారి పలు ప్రాంతాల్లో ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ముఖ్యంగా సిద్దిపేటలోని కరీంనగర్ బైపాస్ రోడ్డులో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల అక్కడి ప్రాంత వాసులకు కంటిమీద కునుకు లేకుండాపోతుంది. సిద్దిపేట శివారులో ప్రాంతమైన రంగీలా దాబా చౌరస్తా నుంచి మొదలుకొని నర్సాపూర్ చౌరస్తా వరకు నిత్యం ఏదో ఒక రోడ్డు ప్రమాదం జరిగి వాహనదారులు స్వల్ప, తీవ్ర గాయాలతో బయటపడినా, ఒకానొక సందర్భంలో అక్కడికక్క డే మృతిచెందడం లేదంటే చికిత్స పొందుతూ మృతిచెందడం లాంటి ఘటనలు అనేకం. వాహనదారుల ప్రాణాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం స్పష్టమవుతుంది.

ప్రమాదకరంగా రెండు కిలోమీటర్లు..

సిద్దిపేట శివారులోని రంగీలా దాబా చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు దాదాపు రెండు కిలోమీటర్లకు పైగా ఉన్న రాజీవ్ రహదారిలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల 15కు పైగా జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారు. దాదాపు 11 మం దికి పైగా స్వల్ప, తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఆ రెండు కిలోమీటర్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటున్నది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న రహదారిపై సిద్దిపేటకు చేరుకోగానే రంగీలా దాబా చౌరస్తా నుంచి వైశ్య సంక్షేమ సమితి, యాదవ కమ్యూనిటీ హాల్, డబుల్ బెడ్‌రూంలు ఎడమవైపున, నర్సాపూర్ చౌరస్తా వద్ద కుడి వైపున పటేల్ గార్డెన్ ఉండడంతో శుభకార్యాల సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటున్నది. వాహనదారులు హడావిడిలో ఒక్కోసారి గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



సిద్దిపేటలోని రాజీవ్ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనాలు



సిద్దిపేటలోని రాజీవ్ రహదారిపై రాంగ్‌రూట్‌లో వస్తున్న కారు

కానరాని సూచిక బోర్డులు, బారికేడ్లు

రంగీలా దాబా చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు దాదాపు 4 నుంచి 5 బ్లాక్ స్పాట్‌లున్నట్లు అధికారులు గతంలోనే గుర్తించారు. వీటిలో ముఖ్యంగా కేసీఆర్ నగర్‌లో నిర్మించిన డబుల్ ఇళ్ల వద్ద అధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. డబుల్ ఇళ్ల కాలనీవాసులు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. తిరుగు ప్రయాణంలో డబుల్ ఇళ్ల వద్దకు వెళ్లాలంటే నర్సాపూర్ చౌరస్తా నుంచి కుడివైపున రాంగ్‌రూట్‌లోనే అత్యధికంగా వాహనదారులు వెళ్తున్నారు. దీంతో కరీంనగర్ నుంచి వస్తున్న ఫోర్ వీలర్ నుంచి మొదలుకొని హెవీ లారీ అతి వేగంగా రావడంతో ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాన్ని చూసుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. డబుల్ ఇళ్ల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలుండటంతో అధికారులు అతి వేగానికి సంబంధించిన సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం గమనర్హం.

రాంగ్ రూట్‌తో పొంచి ఉన్న ప్రమాదం

ప్రమాదాలు జరగడానికి వాహనదారులు రాంగ్‌రూట్‌లో

మిగతా 8వ పేజీలో

హైవే విస్తరణ పనులు సాగుతున్నా..

టోల్ పెంపు అమలు

తూప్రాన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 44పై మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ టోల్ ప్లాజాలో సోమవారం అర్థరాత్రి నుంచి టోల్ రుసుం పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు టోల్‌ప్లాజాల్లో నూతన టోల్‌రుసుం చార్జులను ఏర్పాటు చేశారు. 2023-24లో టోల్‌ప్లాజాలో 5 నుంచి 7శాతం వరకు టోల్ రుసుం తగ్గించారు. 2024-25 సంవత్సరానికి పెంచాలని ఆదేశాలు జారీ చేశారు కానీ, పెరగలేదు. మనోహరాబద్ మండలం కాళ్లకల్ నుంచి బోయిన్‌పల్లి వరకు హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తున్నారు. విస్తరణ పనులు జరుగుతుండటంతో 2024 మార్చి 31న రాత్రి జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) నుంచి టోల్ రుసుం పెంపు వద్దంటూ మౌఖిక ఆదేశాలు రావడంతో నిలిపివేశారు. ప్రస్తుతం సైతం హైవే విస్తరణ పనులు కొనసాగుతున్నప్పటికీ టోల్ రుసుం పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి.



హైవే 44పై ఉన్న టోల్‌ప్లాజా

మందుబాబుల వీరంగం

- వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను ఢీకొట్టి పరార్
- ఎస్ఐ నాగలక్ష్మికి స్వల్పగాయాలు

జిన్నారం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం శివారులో మందుబాబులు వీరంగం సృష్టించారు. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను కారుతో ఢీకొట్టి పరారయ్యారు. ఈ సంఘటనలో ఎస్ఐ నాగలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల శివారులో సోమవారం రాత్రి ఎస్ఐ నాగలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మద్యం సేవించి కారు నడిపిన వ్యక్తిని విచారిస్తుండగా.. మంగంపేట నుంచి వచ్చిన మరో కారులోని ఇద్దరు వ్యక్తులు పోలీసులను ఢీకొట్టి కారుతో పరారయ్యారు. వెంటనే పోలీసులు కారును వెంబడించగా.. లక్ష్మీపతి గూడెం చౌరస్తా వద్ద దుండగులు కారు వదిలి పారిపోయారు. పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఎస్ఐ నాగలక్ష్మి స్వల్పంగా గాయపడ్డారు.

పండుగరోజు రాని మంజీరా నీరు

సంగారెడ్డి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పండుగ రోజున మంజీరా నీరు రాక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆదిత్యనగర్ కాలనీ అధ్యక్షుడు జీ.సాయిలు అన్నారు. పట్టణంలోని ఆదిత్యనగర్, వసంతనగర్, బర్మాకాలని, ఓడీఎఫ్ కాలనీ, బ్యాంకు కాలనీ, పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో దాదాపుగా 12 వార్డుల్లో రెండురోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. ఓవైపు కలెక్టర్, అధికారులు నీటి కొరత రాకుండా చూడాలని చెబుతున్నా.. మున్సిపల్, జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

మెదక్ జిల్లాలో ఎల్ఆర్ఎస్ రాబడి

రూ.10.38 కోట్లు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : ప్లాట్లు, స్థలాల క్రమబద్ధీకరణ కోసం మార్చి 31వ తేదీలోపు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. 2020వ సంవత్సరంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 14,772 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 11,812 దరఖాస్తులకు అనుమతి లభించగా 2,252 దరఖాస్తులను తిరస్కరించారు. ఈ మేరకు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఇప్పటి వరకు 2,134 మంది ఎల్ఆర్ఎస్ రుసం చెల్లించగా రూ.10.38 కోట్ల ఆదాయం సమకూరింది. మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 3,811 దరఖాస్తులు రాగా 248 తిరస్కరించారు. నేటికి 535 మంది దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ పూర్తి చేసుకున్నారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో 1945 దరఖాస్తులకు 388 తిరస్కరించారు. 311 మంది లబ్ధిదారులు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలో 6,538 దరఖాస్తులకు 1477 తిరస్కరించారు. 927 మంది ఎల్ఆర్ఎస్ రుసుం కట్టుకున్నారు. రామాయంపేట మున్సిపాలిటీలో 2,478 దరఖాస్తులకు 139 తిరస్కరించారు. ఇక్కడ 361 మంది డబ్బు చెల్లించగా జిల్లా మొత్తంగా రూ.10.38 కోట్ల ఆదాయం సమకూరింది. ఎల్ఆర్ఎస్ విషయంలోనూ 25శాతం రాయితీ ఇచ్చినప్పటికీ అనుమతినిచ్చిన దరఖాస్తుల్లో కనీసం 25 శాతం కూడా సద్వినియోగం చేసుకోకపోవడం గమనార్హం.



ఎల్ఆర్ఎస్ అనుమతి పత్రాన్ని అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీటీసీపీవో మెదక్ జిల్లా ఇంచార్జి భూపతి(ఫైల్)

మెదక్ మున్సిపాలిటీలో రూ.4.52 కోట్ల పన్ను వసూలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మెదక్ మున్సిపాలిటీలో 80 శాతంపైగా పన్నులు వసూలు చేశారు. పట్టణంలో 12139 నివాస, నివాసేతర భవనాలు ఉండగా రూ.5.57 కోట్లు పన్నుల రూపేణ రావాల్సి ఉండగా రూ.4.52 కోట్లు వసూలు చేశారు. ఆశించిన ఫలితాలను చేరుకోలేకపోయారు. గత యేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పన్ను వసూళ్లలో వెనుకబడింది.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- డీఎస్పీ వెంకట్‌రెడ్డి

మనోహరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం దండుపల్లి ఐటీసీ పరిశ్రమ సహకారంతో మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు రూ.2.40 లక్షల సీసీ కెమెరాలు, ఐదు బారికేడ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు, నేరాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్, ఐటీసీ హెచ్ఆర్ సూర్య భగవాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

అత్యాచారం కేసులో ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఓ వివాహితపై అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 25వ తేదీన అర్ధరాత్రి కంది మండలం మామిడిపల్లి చౌరస్తా వద్ద భర్తతో ఆటోలో వెళ్తున్న ఓ వివాహితపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. అడ్డొచ్చిన భర్తను కొట్టి మరీ ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ కేసులో సంగారెడ్డి పట్టణానికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మద్యం మత్తులో దారుణం...

సంగారెడ్డి పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు మార్చి 25న అర్ధరాత్రి కంది మండలం మామిడిపల్లి చౌరస్తాలో మద్యం సేవిస్తూ ఉన్నారు. అదే సమయంలో సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వైపు ఆటోలో వెళ్తున్న భార్యాభర్తలను అడ్డుకున్నారు. భర్తపై దాడి చేసి వివాహితను స్కూటీపై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలు సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ పంకజ్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నందున నిందితుల పేర్లు వెల్లడించడం లేదన్నారు. నిందితుల్లో ఒకరు గతంలో ఓ గొడవ కేసుతో సంబంధం ఉన్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ సత్తయ్యగౌడ్, సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతి కుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ శివకుమార్, ఎస్ఐలు రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సాంకేతికత పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ పంకజ్ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని సూచించారు.

వ్యాపార కేంద్రాలే లక్ష్యంగా చోరీలు

- పక్షం రోజుల్లోనే నాలుగు దుకాణాల్లో నగదు అపహరణ
- తాజాగా కిరాణ, వస్త్ర దుకాణంలో చోరీ



సీసీ కెమెరాకు చిక్కిన దొంగ

సంగారెడ్డి క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో వ్యాపార కేంద్రాలే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలనే ఎంచుకుంటున్నారు. గత పక్షం రోజులుగా దుకాణాల్లో నగదు అపహరణకు పాల్పడుతున్నా పోలీసులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి కొత్తబస్టాండ్ సమీపంలోని ఓ కిరాణ దుకాణంలో, చిన్న పిల్లల వస్త్ర దుకాణంలో దొంగతనాలు జరిగాయి. దుకాణాల షట్టర్లను పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగ నగదును అపహరిస్తున్నాడు. అశోక్ కిరాణ షాప్‌లో రూ.20వేల నగదు, ఫస్ట్ క్రై డాటట్ కామ్ అనే చిన్న పిల్లల వస్త్ర దుకాణంలో రూ.16వేల నగదును దొంగిలించాడు. దొంగ నగదు చోరీ చేస్తున్న దృష్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఇటీవల పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న మూడు మెడికల్ షాప్‌ల్లో సైతం వరుసగా చోరీలు జరిగాయి.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య



మాణిక్ (ఫైల్)

సిద్దిపేట రూరల్,మార్చి 31(ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మోత్కు మాణిక్ (19) వృత్తి రీత్యా మెకానిక్. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడతున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రాందేని రవి వ్యవసాయ భూమిలోని షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల రిమాండ్

రాయపోల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాల నెపంతో వ్యక్తిపై దాడి చేసిన కేసులో 9 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన తిరుడి ఆంజనేయులు మంత్రాలు చేస్తున్నాడని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన దూనపల్లి ప్రవీణ్ కుటుంబ సభ్యులతో పాటు బంధువులు ఈ నెల 29న రాత్రి అతడిపై దాడి చేసి గాయపరిచారు. ఆంజనేయులు భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. దాడి కేసులో నిందితులైన దోనపల్లి ప్రవీణ్, దోనపల్లి రాజు, దోనపల్లి లక్ష్మి, కాస భిక్షపతి, కాస యాదగిరి, కాస రాజు, కాస నవీన్, కాస కరుణాకర్, అరికెల జైపాల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

జోగిపేట రూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రాంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మన్నె గోపాల్, బర్దిపూర్ గ్రామానికి చెందిన అంజయ్య బైక్‌లపై వస్తుండగా అందోల్ మండలం కన్సన్‌పల్లి గ్రామ పరిధిలోని ప్రధాన రహదారిపై సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వారిద్దరికీ తీవ్రగాయాలు కాగా, గడ్డిపెద్దాపూర్ గ్రామానికి మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అడవిపంది దాడిలో మహిళకు గాయాలు

చిన్నశంకరంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అడవి పంది దాడిలో మహిళ గాయపడిన సంఘటన చిన్నశంరంపేట మండలంలోని ఎస్ కొండాపూర్ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గవ్వపల్లి తండాకు చెందిన దేవసుత్ లక్ష్మి పొలం వద్దకు వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా అడవి పంది ఆమెపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సు వాహనంలో మెదక్ ఆసుపత్రికి తరలించారు.


అర్బన్ పార్కులో కాలువలోనే నీటిలో నిర్మిస్తున్న కాటేజీలు

అధునాతన సొబగులు

పర్యాటక ప్రగతి దిశగా నర్సాపూర్ అర్బన్ పార్కు

ఓ వైపు పచ్చని అడవులు.. మరో వైపు చెరువుతో ఇప్పటికే ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్న నర్సాపూర్ అర్బన్ పార్కులో మరిన్ని వసతులు సమకూరుతున్నాయి. పర్యాటకుల కోసం అధునాతన కాటేజీలతో పాటు స్విమ్మింగ్ పూల్, కిచెన్, డైనింగ్, బంకేట్ హాళ్లు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే పనులు తుది దశకు చేరుకోగా ఈ నెలలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

- నీటిలో విలాసవంతమైన కాటేజీల నిర్మాణం
- స్విమ్మింగ్ పూల్, కిచెన్, డైనింగ్ హాల్ మరెన్నో..
- తుది దశకు పనులు.. ఈ నెలలోనే ప్రారంభానికి సన్నాహాలు

నర్సాపూర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అర్బన్ పార్కును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. పర్యాటకుల విడిది కోసం కాటేజీలు నిర్మించి సకల సదుపాయాలు కల్పిస్తున్నారు. సందర్శకులు ఉదయం వచ్చి అడవిలోని పచ్చని చెట్ల మధ్య తిరిగి ప్రకృతిని ఆస్వాదిస్తూ తిరిగి సాయంత్రం వెళ్లిపోతున్నారు. పలువురు ఇక్కడే సేదా తీరాలని ఉన్నా వసతులు లేకపోవడంతో సాధ్యపడడం లేదు. ప్రస్తుతం అర్బన్ పార్కులో నిర్మిస్తున్న కాటేజీలతో అక్కడే విడిదికి వీలుంటుంది. దీంతో పాటు చిన్నచిన్న కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి హాల్, సరదా కోసం స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మిస్తున్నారు. రాష్ట్ర రాజధానికి కేవలం 40కిలోమీటర్ల దూరంలో నర్సాపూర్ ఉండటంతో అర్బన్ పార్కుకు పర్యాటకుల తాకిడి పెరుగుతున్నది. సెలవు దినాల్లో అయితే అధిక సంఖ్యలో తరలివస్తూ ఇక్కడి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇక కాటేజీలు పూర్తయి అందుబాటులో వస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా మరింత ప్రగతి సాధించనున్నది.

రూ.3 కోట్లతో 22 కాటేజీలు


అర్బన్ పార్కు పరిధిలో ఉన్న నీటి కాలువలోనే రూ.3 కోట్లతో 22 కాటేజీలను నిర్మిస్తున్నారు. వీటిలో సేద తిరుతూ పక్కనే ఉన్న చెరువు అందాలతో పాటు తాము నీటిపై తేలి ఆడుతున్న అనుభూతి కలిగేవిధంగా నిర్మాణం చేపట్టారు. వీటితో పాటు స్విమ్మింగ్ పూల్, కిచెన్, డైనింగ్ హాల్, ఓపెన్ హోటల్ తదితర వసతులు కల్పిస్తున్నారు. ఈ పనులు ప్రస్తుతం చివరి దశలో ఉండగా.. త్వరలోనే పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, పార్కుకు వచ్చిన పర్యాటకులు ఏదైనా తినడానికి ఇక్కడ ఎలాంటి హోటళ్లు లేవు. దీంతో నర్సాపూర్ పట్టణంలోకి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం కల్పిస్తున్న వసతులు అందుబాటులోకి వస్తే ఈ సమస్యకు పరిష్కారం లభించనున్నది. ఫలితంగా పర్యాటకుల తాకిడి మరింత పెరగనున్నది.

త్వరలో అందుబాటులోకి ..

నర్సాపూర్ అర్బన్ పార్కులో నిర్మిస్తున్న కాటేజీలు ఇతర సదుపాయాలు ఈ నెలలోనే పర్యాటకులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పనులన్ని చివరిదశలో ఉన్నాయని వేగతంగా పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బోటింగ్ ఏర్పాటు చేయాలని వినతులు..

అడవి పక్కనే ఉన్న నర్సాపూర్ రాయరావు చెరువులో బోటింగు సౌకర్యం కల్పిస్తే ఇంకా బాగుంటుందని పలువురు అభిప్రాయపడతున్నారు. బోటింగ్‌తో పర్యాటకంగా మరింత ప్రగతి సాధిస్తుందని, ఈ విషయమై పాలకులు, అధికారులు దృష్టి సారించాలని స్థానికుల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి.


ఏర్పాటు చేస్తున్న స్విమ్మింగ్ పూల్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్‌పల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తొగుట మండలం వేముల గట్టు గ్రామానికి చెందిన శ్రీనివాస్ (49) సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడు తన కూతురును రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో దింపి తిరిగి కాళ్లకుంట కాలనీకి వస్తుండగా ఎన్సాన్‌పల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కోహీర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. కోహీర్ ఎస్‌ఐ సతీష్ వర్మ కథనం ప్రకారం కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఎండీ ఆసిఫ్ (40) ఆదివారం రాత్రి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై కాలినడకన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

తూప్రాన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): క్వారీ నీటి గుంతలో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభించింది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన వడ్ల ప్రభాకర్ (45) కుటుంబీకులు ఎవరు లేకపోవడంతో మూడేళ్ల క్రితం తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లికి వచ్చి కరీంగూడకు చెందిన పల్లపు యాదగిరి వద్ద కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కూలీ పనుల అనంతరం ప్రభాకర్ కరీంగూడ తైదలబండ క్వారీలో స్నానం చేసేందుకు వెళ్లాడు. స్నానం చేస్తున్న సమయంలో ప్రభాకర్‌కు ఫిట్స్ రావడంతో నీట మునిగిపోయాడు. అక్కడ ఎవరూ లేకపోవడంతో గుర్తించలేకపోయారు. ఆదివారం ఉదయం పనులకు రాకపోవడంతో ప్రభాకర్ కోసం యాదగిరి గాలింపు చేపట్టగా, క్వారీ వద్ద ఒడ్డున అతడి బట్టలు, చెప్పులు కనిపించాయి. అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం అతడి మృతదేహం లభించింది. పల్లపు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య


యాదగిరి(ఫైల్)

తూప్రాన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): భూమి పట్టా విషయంలో భార్య, భర్తలు గొడవ పడగా మనస్తాపానికి గురైన భర్త సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణానికి చెందిన దాసరి యాదగిరి(47) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దాసరి యాదగిరి తన పొలం వేరే వ్యక్తి పేర పట్టా చేయించగా, తిరిగి పట్టా చేయించాలని భార్య ప్రవీణ భర్త యాదగిరితో గొడవపడేది. ఆదివారం ఉదయం ఇదే విషయంలో దంపతులు గొడవ పడ్డారు. దీంతో సాయంత్రం ఇంట్లో నుంచి బయటకెళ్లిన యాదగిరి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సమీపంలోని మ్యాడక చెరువులో యాదగిరి శవమై కనిపించాడు. భార్య ప్రవీణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

వైభవంగా బోనాలు, బండ్ల ఊరేగింపు


చిన్నశంకరంపేట పోచమ్మ ఆలయం వద్ద బండ్ల ఊరేగింపు

చిన్నశంకరంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండగా సందర్భంగా చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల్లో బోనాల బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించారు. సోమవారం చిన్నశంకరంపేట మండలం కేంద్రంలోని నల్లపోచమ్మ, జంగరాయిలో ఊడాల మర్రి నల్లపోచమ్మ, దుర్గమ్మ, గజగట్లపల్లిలో వెంకటేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బండ్లు, బోనాలను ఊరేగింపు కనుల పండువగా సాగింది. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలు ఆలయాల వద్ద నిర్వాహకులు అన్నదార కార్యక్రమాలు నిర్వహించారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఉత్సవాల్లో..


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

పుల్‌కల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చౌటకూర్‌లోని అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోచమ్మ, దుర్గమ్మ అమ్మవార్లతో పాటుగా ఇతర గ్రామ దేవతలకు గ్రామస్థులు బోనాలను తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు. డీజే చప్పుళ్లు, డోలు, వాయిద్యాల మధ్య బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వీటితో పాటు అగ్ని గుండాలు కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మత్తడి పోచమ్మ జాతరలో..

నారాయణఖేడ్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలను ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం రెండవ రోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాతతోపాటు మత్తడి పోచమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకం, అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వమించారు. ఒడిబియ్యం, కండజ్యోతి సమర్పణలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బండ్ల ప్రదర్శనను అట్టహాసంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.


మత్తడిపోచమ్మ జాతరలో బండ్ల ఊరేగింపు

వ్యక్తి దారుణ హత్య

- స్నేహితులతో మద్యం సేవిస్తుండగా ఘర్షణ
- చేతి రుమాలు గొంతుకు బిగించి చంపిన వైనం
- మృతుడు బీఆర్ఎస్ కార్యకర్త


హత్యకు గురైన హరిసింగ్

కల్హేర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : గిరిజనుడు దారుణ హత్యకు గురైన సంఘటన సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కల్హేర్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పోమ్యానాయక్‌తండా గ్రామ పంచాయితీ పరిధిలోని కొశ్చరితండాకు చెందిన విస్లావత్ హరిసింగ్(56) కల్హేర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో రోజువారి కూలీగా స్వీపర్ పని చేసుకుంటూ జీవిస్తుండేవాడు. మద్యానికి బానిసైన హరిసింగ్ నిత్యం మద్యం తాగుతుండేవాడు. కాగా, హరిసింగ్‌ను అతని స్నేహితుడు పోమ్యానాయక్‌తండాకు చెందిన సీతారాం, కొశ్చరితండాకు చెందిన హరిసింగ్ దాయాది గణపతి మద్యం తాగుదామని ఆదివారం రాత్రి కల్హేర్‌లో బైకుపై ఎక్కించుకుని కల్హేర్ గ్రామ శివారులోని నీలం వాగు వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తుండగా వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో మద్యం మత్తులో హరిసింగ్‌ను తోటి స్నేహితులు మెడకు చేతి రుమాలు బిగించి హత్య చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. హరిసింగ్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్త కావడంతో ఈ హత్య సంచలనం కలిగించింది. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి రాజకీయ కోణంలో హత్య జరిగిందని ఆరోపించడంతో పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. అనంతరం సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని ప్రాథమికంగా విచారించడంతో వారు నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందులో రాజకీయ కోణం ఏమి లేదని, నిత్యం మద్యం సేవించే తోటి వారే హత్యకు పాల్పడినట్లు నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డిలు పరిశీలించారు. హత్యకు గల కారణాలను ఎస్‌ఐ వెంకట్‌రెడ్డికి అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని తరలిస్తుండగా తమకు నిందితులను అప్పగించాలని, దారుణ హత్యకు పాల్పడిన వారిని తామే శిక్షిస్తామని మృతుని బంధువులు, తండావాసులు అడ్డుకున్నారు. దీంతో ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి అదనంగా పోలీసులను రప్పించి ఎట్టకేలకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నారాయణఖేడ్‌కు తరలించారు. మృతుడి భార్య పిప్లిబాయి ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి నిందితులు సీతారాం, గణపతిలను అదుపులోకి తీసుకుని విచారించనున్నట్లు సిర్గాపూర్, కల్హేర్ ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, వెంకటేశం తెలిపారు.

మనస్తాపంతో యువకుడు..


నర్సింహులు(ఫైల్)

నిజాంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పని చేసుకోమని నానమ్మ మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కమ్మరి నర్సింహులు (20) తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో తన నానమ్మ కమ్మరి కమలమ్మ పెంచి పెద్ద చేసింది. కమలమ్మకు వయసు పైబడడం.. నర్సింహులు ఏ పని చేయకపోవడంతో.. ఎన్నిరోజులు పనిచేయకుండా ఉంటావని ఏదైనా పని చేసుకోమని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నర్సింహులు ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మృతుడి నానమ్మ కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

తాగుడుకు బానిసై..


మల్లేశం(ఫైల్)

కొండపాక , మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన రోడ్డ మల్లేశం(31) గూడ్స్ వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా అతడు తాగుడుకు బానిసగా మారడం, అప్పులు కూడా ఎక్కువవడంతో మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తన వాహనం టైర్ పంక్చర్ చేయించుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. భార్య అనూష తండ్రి శంబయ్య చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి చిన్నాన్న లక్ష్మణ్ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా మల్లేశం మృతదేహం చెట్టుకు వేలాడుతున్న కనిపించింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'వ్యవసాయ కళాశాలను మరోచోట ఏర్పాటు చేయాలి'

బెజ్జంకి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండలానికి మంజూరైన వ్యవసాయ కళాశాలను గాగిల్లాపూర్‌లో తోటపల్లి ప్రాజెక్టు కింద రైతులు కోల్పోయిన భూముల్లో కాకుండా మరోచోట ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం బెజ్జంకి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు కోసం గతంలో ప్రభుత్వం భూములు సేకరించిందన్నారు. అనంతరం ప్రాజెక్టు రద్దు కావడం.. భూములు ప్రభుత్వ అధీనంలోనే ఉండటంతో రైతుబంధు, రైతుబీమా నష్టపోయామన్నారు. మా భూములు మాకు రిఇగి ఇవ్వాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. ఈ విషయమై హై కోర్టును సైతం ఆశ్రయించగా, కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిజర్వాయర్‌లో కోల్పోయిన సుమారు 138 ఎకరాల భూమిని రెండు ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం అప్పగించిందని, మావి కూడా మాకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మండలానికి వచ్చిన కళాశాలను ఇతర ప్రభుత్వ భూముల్లోకి తరలించాలని వారు కోరారు.


గాగిల్లాపూర్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

మల్కాపూర్ మసీద్‌లో అగ్నిప్రమాదం

పెద్దశంకరంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండలంలోని మల్కాపూర్ మసీద్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ఘటనలో మసీదులో ఉన్న మొహర్రం పండుగకు వినియోగించి వస్తువులు దగ్ధమయ్యాయి. దీంతో రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని గ్రామ పెద్దలు తెలిపారు. రంజాన్ పండుగ రోజు ఇలాంటి ఘటన జరగడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

'పది' మూల్యాంకనానికి ఏర్పాట్లు

- ఈ నెల 7 నుంచి ప్రారంభం
- ఆర్సీపురం సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్‌లో మూల్యాంకనం

సంగారెడ్డి అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు ముగియనుండడంతో జవాబు పత్రాల మూల్యాంకనంపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా జవాబు పత్రాల మూల్యాంకనానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం జ్యోతినగర్‌లోని సెయింట్ ఆర్నాల్డ్ హైస్కూల్‌లో జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే స్పాట్ కేంద్రానికి జవాబు పత్రాలు చేరుకుంటుండగా, పోలీస్ బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మార్చి 25 వ తేదీ నుంచి జవాబు పత్రాల కోడింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఈ నెల 7 వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు జవాబు పత్రాలను దిద్దనున్నారు. ఈ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నది.


మూల్యాంకనం చేసే రామచంద్రాపురంలోని సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్

అధికారుల నియామకం

మూల్యాంకన ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బందిని నియమించింది. క్యాంపు అధికారిగా(డీఈవో), డిప్యూటీ క్యాంపు ఆఫీసర్స్-2, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు--6, కోడింగ్ క్యాంపు ఆఫీసర్స్-2, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లు-9, స్పెషల్ అసిస్టెంట్స్ -4, స్ట్రాంగ్ రూమ్ సిబ్బంది-5, అసిస్టెంట్ ఎగ్జామినర్లు-600, చీఫ్ ఎగ్జామినర్లు-200, స్పెషల్ అసిస్టెంట్లు-200 ఈ విధంగా సుమారు వేయి మందిని నియమించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని ఉపాధ్యాయులకు స్పాట్ విధులు కేటాయించారు. అయితే ఈ స్పాట్ క్యాంపులో 2.30 లక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం చేయనున్నారు.

పోలీస్ భద్రత మధ్య ..

ఇప్పటికే పదో తరగతి జవాబు పత్రాలను ప్రత్యేక వాహనాల్లో స్పాట్ కేంద్రానికి చేర్చారు. 24 గంటల పోలీస్ పహారా మధ్య స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేసి భద్రపర్చారు. కేంద్రంలోకి ఇతరులకు ప్రవేశం లేకుండా విధులు కేటాయించిన వారిని మాత్రమే అనుమతించేలా పటిష్ట బందోబస్తు చేపట్టారు. ఇక మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వహించే వారి కోసం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ అవసరమైన చర్యలు తీసుకుంటున్నది. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.



సిద్దిపేటలో ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు


గజ్వేల్: ప్రజ్ఞాపూర్ ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి


హుస్నాబాద్‌లోని అలంగీర్ మసీదు వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఘనంగా ఈద్ ఉల్ ఫితర్


చేర్యాల మండలం కాశీగుడిశెలు గ్రామంలో ముస్లింల ప్రార్థనలు


మద్దూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు పాటించిన ఉపవాస దీక్షలను విరమించారు. ఆయా పట్టణాలు, గ్రామాల్లోని మసీదులు, ఈద్గాలలో ఉదయం ముస్లిం సోదరులు కొత్త దుస్తులు ధరించి మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు పరస్పరం ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు పార్టీల నాయకులు సైతం ఈద్గాలవద్దకు వెళ్లి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేటలోని ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో కలిసి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, కౌన్సిలర్ రియాజుద్దీన్‌తో పాటు పలువురి ముస్లీం నాయకుల నివాసాలకు వెళ్లి రంజాన్ వేడుకల్లో పాల్గొని, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజ్ఞాపూర్‌లోని ఈద్గా వద్ద శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, గజ్వేల్ ఈద్గా వద్ద బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డిలు ముస్లిలకు శుభాకాంక్షలు తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని అలంగీర్ మజీద్ వద్ద ఉన్న ఈద్గాకు చుట్టు పక్కల గ్రామాల ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ములుగు మండలంలోని పలు గ్రామాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ముస్లిం సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కొండపాక, జగదేవ్‌పూర్, రాయపోల్, వర్గల్, చిన్నకోడూరు, తొగుట, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి, కోహెడ, మద్దూరు, నంగునూరు, మర్కుక్, దుబ్బాక మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం అలయ్‌బలయ్‌లతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి)

ప్రజారోగ్యాన్ని పట్టించుకోరా?

- ప్రమాదకరమైన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని డిమాండ్
- అసెంబ్లీ స్పీకర్ వ్యాఖ్యలతో అందరి దృష్టి ఆ చెట్లపైనే
- పూలు, నీడనిచ్చే ఇతర మొక్కలు నాటాలని స్థానికుల విజ్ఞప్తి

చేర్యాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పక్షులు కూడా వాలక పోగా, ప్రజల ఆరోగ్యానికే ముప్పుగా మారిన కోనోకార్పస్ చెట్లు, మొక్కలను తొలగించాలని చేర్యాల పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హరితహారం పేరిట జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారికి ఇరు పక్కల, డివైడర్లలో కొన్నేళ్ల క్రితం కోనోకార్పస్ మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి పచ్చదనం రూపుదిద్దుకున్నప్పటికీ ప్రాణాంతకమైనవిగా ప్రచారం జరుగుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాన్ని హరితమయంగా తీర్చిదిద్దేందుకు నర్సరీలో పలు రకాలపూల మొక్కలు, కదంబ మొక్కలున్నప్పటికీ అధిక డబ్బులు వెచ్చించి పొరుగు ప్రాంతాల నుంచి కోనోకార్పస్ మొక్కలు తెప్పించి మరీ నాటారు. దీంతో పట్టణంలో పచ్చదనం సంతరించుకున్నప్పటికీ కోనోకార్పస్


చేర్యాలలోని జాతీయరహదారి డివైడర్లలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

మొక్కల వల్ల జరిగే నష్టంపై ప్రచారాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కొన్నినెలల క్రితం చేర్యాల సమీపంలోని పలు మునిసిపాలిటీ అధికారులు కోనోకార్పస్ మొక్కలు తొలగించినప్పటికీ, చేర్యాల మునిసిపల్ అధికారులు మాత్రం స్పందించకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అసెంబ్లీ స్పీకర్ సూచించినా..

ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ స్పీకర్ కోనోకార్పస్ మొక్కలు తొలగించాలంటూ ప్రభుత్వానికి సూచనలు చేశారు. దీంతో పట్టణంలోని అందరి దృష్టి కోనోకార్పస్ చెట్లపైకి మళ్లింది. సదరు చెట్లు, మొక్కలను తొలగించి వాటి స్థానంలో పూలు, నీడ నిచ్చె మొక్కలునాటి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తమ పరిసరాల్లోని మొక్కలను తొలగించేందుకు అనుమతించాలని కోరుతున్నారు. మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆహ్వానం


హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి ఉత్సవాలకు రావాలని సిద్దిపేట నియోజకవర్గంలోని పలు ఆలయాల నిర్వాహకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆహ్వానించారు. నంగునూర్ మండలం నర్మేట గ్రామంలోని రామాలయం, సిద్దిపేట పట్టణంలోని హరిప్రియ నగర్‌లోని శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయం, శ్రీపంచముఖ హనుమాన్ ఆలయం, గణేష్‌నగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం, శ్రీ రామరాజు రావి చెట్టు హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని ఆయా ఆలయ నిర్వాహకులు మాజీమంత్రి హరీశ్‌రావుకు సోమవారం ఆహ్వానపత్రికలను అందజేశారు.

సోమిరెడ్డి కుటుంబానికి పరామర్శ

నంగునూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్లమల్యాల గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్, అయిల్‌పామ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి తండ్రి మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతడి కుటుంబాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు


మల్లారం శివారులో రాజీవ్ రహదారి పై బోల్తాపడిన కారు

చిన్నకోడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారం గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై సోమవారం కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఎడవల్లి సాగర్‌రెడ్డి తన సోదరుడి కుమారుడితో కలిసి కారులో సుల్తానాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో మల్లారం గ్రామ శివారులో మూల మలుపు వద్దకు చేరుకోగానే కారు ఒక్కసారిగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు పై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సాగర్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సిద్దిపేట అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,940 నగదు, 5మొబైల్ ఫోన్లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10,665 కోట్లు వెచ్చిస్తూ 2.85కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుస్తున్నట్లు స్పష్టం చేశారు. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్‌కార్డులను త్వరలోనే అందించనున్నట్టు తెలిపారు.

కూలీకి వెళ్లిన బీఆర్ఎస్ మహిళా నాయకులు


లక్ష్మీపూర్‌లో కూలీ పనులు చేస్తున్న బీఆర్ఎస్ మహిళా నాయకులు

బెజ్జంకి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కోసం మహిళా మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కూలీ పనులకు వెళ్లారు. వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవసభ దారి ఖర్చుల కోసం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సోమవారం మాజీ మహిళా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మొక్కజొన్న కంకులు తీసేందుకు కూలీ పనులకు వెళ్లినట్లు తెలిపారు. కూలీ ద్వారా వచ్చే డబ్బులతో స్వచ్ఛందంగా సభకు వెళ్లడానికి దారి ఖర్చులకు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ మహిళా ప్రజాప్రతినిధులు నిర్మల, కవిత, పద్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బెజ్జంకి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండలానికి వ్యవసాయ కళాశాల మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం బెజ్జంకిలో సీఎం రేవంత్‌రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మండల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కళాశాలను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రితో సన్నబియ్యం పథకం

హుస్నాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణం బుడిగ జంగాల కాలనీలోని రేషన్‌షాపులో మంగళవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించనున్నారు.

పాస్టర్ల నూతన కార్యవర్గం

హుస్నాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పాస్టర్ల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నర్గీస్, అధ్యక్షుడిగా సోలమన్‌రాజ్, ఉపాధ్యక్షుడిగా ధన్‌రాజ్, కార్యదర్శిగా రత్నం, సహాయ కార్యదర్శిగా సీయోను రాజ్, గాబ్రివేలు, కోశాధికారిగా సంసోన్‌లను ఎన్నుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తొగుట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జప్తి లింగారెడ్డిపల్లి లబ్ధిదారుడు యాదగిరికి రూ.30వేలు, లింగంపేట దాసరి కనకవ్వకు రూ.16,500, ఘనపూర్ గంగసాని మల్లారెడ్డికి రూ.27,500 సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థికసహాయం మంజూరైంది. సోమవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

పండుటాకుకు పలకరింపు



'ఏం రాజయ్య.. నీవే మా అందరికీ స్ఫూర్తి.. మీ కడుపులో పుట్టిన పిల్లలం మాకే మోకాళ్ల చిప్పలు అరిగి, కాళ్లు నొప్పెడుతున్నాయి. నీవు 87ఏళ్ల వయసులో కూడా ఊరూరా పండ్లు అమ్ముకోవడం.. ఎవరిపై ఆధారపడకుండా నీపని చేసుకోవడం నిజంగా బేష్' అంటూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి వయోవృద్ధుడిని అభినందించారు. దుబ్బాకలోని దుంపలపల్లి వార్డుకు చెందిన కుర్మ రాజయ్య అనే వృద్ధుడు సోమవారం సైకిల్‌పై తిరుగుతూ పండ్లు అమ్ముకుంటుండగా పురవీధుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి అతడిని పలకరించారు. కొద్ది సేపు అతడితో ముచ్చటించి సాధకబాధకాలను తెలుసుకున్నారు. 'పండుటాకు' శీర్షికన గతంలో ఆంధ్రజ్యోతిలో ఆ వృద్ధుడిపై ప్రచురితమైన కథనాన్ని గుర్తు చేసుకున్నారు. యువత నిరుత్సాహపడకుండా ఏదో పని చేసుకుంటూ స్వశక్తితో నిలబడాలని ఎమ్మెల్యే కోరారు.

- దుబ్బాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి)

నాచగిరి ప్రధాన అర్చకుడి సేవలు అభినందనీయం


ప్రధాన అర్చకుడు కృష్ణమాచార్యులను సన్మానిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

వర్గల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ప్రధాన అర్చకుడిగా వట్టికోట కృష్ణమాచార్యులు విశిష్టమైన సేవలు అందించారని పలువురు కొనియాడారు. సోమవారం ఆలయం వద్ద ప్రధాన అర్చకుడు కృష్ణమాచార్యులు ఉద్యోగవిరమణ వీడ్కోలు కార్యక్రమాన్ని ఆలయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్యుల దంపతులను అర్చకులు, సిబ్బంది స్వామివారి శేష వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. 45ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించి ఆలయ అభివృద్ధికి కృషి చేసిన ఆయన నేడు ఉద్యోగ విరమణ పొందడం బాధాకరమని తోటి అర్చకులు, ఆలయ అధికారులు పేర్కొన్నారు. అనంతరం అర్చకులు, సిబ్బంది ఆయనను మంగళ వాయిద్యాల మధ్యన ఇంటివరకు సాగనంపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్, పాండు, అర్చకులు జగన్నాధచార్యులు, హరిప్రసాద్ శర్మ, నాగరాజు శర్మతో పాటు ఆలయ సిబ్బంది ఉన్నారు.

యమ డేంజర్

(5వ పేజీ తరువాయి)

రావడమే ప్రధాన కారణంగా పోలీసులు తేల్చిచెబుతున్నారు. పగలు కంటే రాత్రి సమయాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గట్టు రవి ఆయన భార్యతో కలిసి వైశ్య సంక్షేమ సమితిలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రాంగ్‌రూట్‌లో ఎదురుగా ఆక్టివా వాహనంపై వస్తున్న యువకులు గట్టు రవి ద్విచక్ర వాహనానికి ఢీ కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఇలాంటి ప్రమాదాల్లో బయటపడ్డ వారు కాళ్లు, చేతులు కోల్పోయి దివ్యాంగులుగా మారుతున్నారు.

జరిమానాలు విధించాలి

పట్టణంలో హెల్మెట్ లేకుండా, రాంగ్‌రూట్ లో వచ్చేవారికి ట్రాఫిక్ ఫైన్లు వేస్తున్న పోలీసులు.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వారికి కూడా జరిమానాలు వేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని పలువురు వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా చలాన్లు ఎక్కువగా ఉంటే వాహనాన్ని సీజ్ చేయాలి. కొందరు ఇష్టానుసారంగా వెళ్లి ప్రమాదానికి గురవ్వడంతో పాటు ఇతరుల ప్రాణాల మీదకు తెస్తున్నారు.

రాంగ్ రూట్లో వెళ్లొద్దు



వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను, ట్రాఫిక్ నియమాలను పాటించాలి. ఎట్టి పరిస్థితుల్లో రాంగ్ రూట్లో వెళ్లకూడదు. రాంగ్ రూట్లో వాహనాలు వెళ్లడం వలన సక్రమంగా వెళ్లే వాహనదారులకు ఇబ్బంది కలుగుతుంది. నర్సాపూర్ చౌరస్తా నుంచి రంగీలా దాబా చౌరస్తా మధ్యలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లే వాహనదారులు యూటర్న్ దూరంగా ఉన్నదని రాంగ్ రూట్లో వెళ్లడం వల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి. ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనాన్ని నడపొద్దు.

- ఉపేందర్, టూ టౌన్ సీఐ

డబుల్ ఇళ్ల వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలి



రాజీవ్ రహదారి పక్కన డబుల్‌బెడ్ రూంలను ఏర్పాటు చేశారు. డబుల్ బెడ్‌రూం కాలనీలోకి వెళ్లడానికి యూటర్న్ ఏర్పాటు చేయలేదు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లేవారు నర్సాపూర్ చౌరస్తా నుంచి రాంగ్ రూట్లో వెళ్లడం వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజీవ్‌రహదారిపై యూటర్న్ ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది.

- సంతోష్, కేసీఆర్‌నగర్

నర్సాపూర్ చౌరస్తాలో ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలి



రాజీవ్ రహదారి నర్సాపూర్ చౌరస్తాలో ఫ్లైఓవర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఈ చౌరస్తాలో ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు బలవుతున్నారు. రాజీవ్ రహదారిపై వాహనాలు వేగంగా రావడంతో రోడ్డు ప్రమాదాల నివారణకు భారీకేడ్స్ ఏర్పాటు చేయాలి.

- ఎల్లగౌడ్, నర్సాపూర్

మల్లన్నను దర్శించుకున్న అవినాశ్‌రెడ్డి


మల్లన్న సన్నిధిలో స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అవినాశ్‌రెడ్డి

చేర్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అవినాశ్‌రెడ్డి సోమవారం సందర్శించారు. కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకుని అభిషేకం జరిపి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందించి ఆశీర్వదించారు.

భవన నిర్మాణ కార్మిక మహాసభను జయప్రదం చేయాలి

కోహెడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 3న సిద్దిపేట పట్టణంలోని శ్రామికభవన్‌లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో గంగాధర తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం గుర్తింపు కార్డు కలిగిన ప్రతి కార్మికుల పిల్లల వివాహానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.30 వేలు కాకుండా కళ్యాణలక్ష్మి మాదిరిగా రూ. ఒక లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి రూ 5 లక్షల వరకు ఇవ్వాలన్నారు కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె అశోక్, జిల్లా అధ్యక్షుడు బెక్కంటి సంపత్, గంగాధరి తిరుపతి, బొల్లి శంకర్, బొల్లి రాజేశం, ప్రకాష్, బోయిని భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సేవాభావం కలిగి ఉండాలి

గజ్వేల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం శ్రీసీతారామ, ఉమామహేశ్వరాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ప్రేమ విఫలమై టెకీ ఆత్మహత్య

కేపీహెచ్‌బీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి కేపీహెచ్‌బీలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేటలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఉపెరపల్లి మహేందర్ (25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ నెల రోజులుగా కేపీహెచ్‌బీలోని హర్షిత బాయ్స్ పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం రాత్రి హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్ యజమాని గమనించి కుటుంబీకులకు సమాచారమివ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రేమ విఫలమైన ఆత్మహత్య చేసుకున్నాడని, గదిలో సూసైడ్ నోట్ కూడా లభించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చాకిరి చేసినా తప్పని ఎదురుచూపులు

- ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు 3 నెలలుగా అందని వేతనాలు
- భారమైపోతున్న కుటుంబ పోషణ
- ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు


ఉపాధి హామీ కూలీలకు కొలతలు ఇస్తూ పని చూపిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

కొండపాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు వేతనాలందక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తూ వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉదయం నుంచి విధులు నిర్వర్తిస్తూ, పథకం అమలును విజయవంతం చేయడంతో పాటు కూలీలకు సరైన పని కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నా, ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

కష్టపడినా తప్పని ఇక్కట్లు

జిల్లాలో సుమారు 299 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ప్రధానంగా వీరు కూలీల నుంచి పని కోసం దరఖాస్తులు తీసుకోవడం మొదలుకొని పని కేటాయింపు, పని ప్రదేశాల గుర్తింపు, మస్టర్ కొలతలు ఇవ్వడం, కూలీలకు వేతనం పడేలా కొలతలను చూపించడం, ఇతర అభివృద్ధి పనులు చేయించడంలో కూలీల వెంట ఉంటారు. అదే విధంగా పని ప్రదేశాల్లో నీడ, నీరు కల్పించడంతో పాటు జాబ్ కార్డులను అప్‌డేట్ చేస్తుంటారు. ఇంత చేసినా వేతనాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ నెలతో మూడు నెలల నుంచి వేతనాలు అందలేదు. దీంతో కుటుంబ పోషణ ఇతర ఖర్చుల కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ హెల్త్ కార్డు ఇవ్వాలని కోరుతున్నారు.

వేతనాలను ప్రతినెలా అందించాలి

ఉపాధి హామీ కూలీలకు పని కల్పిస్తూ ప్రభుత్వ పథకాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచి ప్రతినెలా అందించాలి. ఉద్యోగ భద్రత కల్పించి ఇన్సూరెన్స్ సౌకర్యం ఇవ్వాలి. హెల్త్‌కార్డులు ఇవ్వాలి. విధి నిర్వహణలో చనిపోయిన ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.10 లక్షల ప్రమాద బీమాతో పాటు ఇంటిలో ఒకరికి ఉద్యోగం సౌకర్యం కల్పించాలి. కేటగిరి రెండులో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఒకటో కేటగిరిలోకి తీసుకోవాలి. ప్రభుత్వం ప్రభుత్వం మమ్ములను ఆదుకొని జీతాలు పెంచాలి.

-పసుల స్మైలాబ్, ఫీల్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు